www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

శనివారం
14.11.2026



3 లో

కేటీఆర్‌తో పెద్ది స్వప్న భేటీ

- హైదరాబాద్‌లోని కేటీఆర్ స్వగృహంలో కలిసిన స్వప్న
- పలు కీలక అంశాలపై నేతల మధ్య చర్చ
- ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహంపై ప్రత్యేక సమాలోచనలు
- పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన

వరంగల్ జిల్లా బీఆర్ఎస్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో వరంగల్ జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో భేటీ కావడం ఆసక్తికరంగా మారింది. జిల్లాలోని తాజా రాజకీయ పరిస్థితులు, స్థానిక సంస్థల బలోపేతంతో పాటు రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా సమాలోచనలు జరిపారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడాలని, పార్టీని మరింత బలోపేతం చేసేలా సమన్వయంతో పనిచేయాలని కేటీఆర్ ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు.

కాంగ్రెస్‌లో కోవర్టులు!



- నాగర్‌కర్నూల్ రాజకీయాల్లో కలకలం
- ఆచితూచి అడుగులు వేస్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి
- వందమంది ఉన్నా.. వ్యూహం మాత్రం గోప్యమే
- అభివృద్ధి పనులపై దృష్టి.. ప్రచారానికి దూరం
- తండ్రి అనుభవం.. తనయుడి వ్యూహంతో
- నాగర్‌కర్నూల్ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు
- వ్యాపార వర్గాల్లోనూ రాజకీయ చర్చ

నాగర్‌కర్నూల్ నియోజకవర్గ రాజకీయ ముఖచిత్రం రోజురోజుకూ రసవత్తరంగా మారుతోంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య తెరవెనుక జరుగుతున్న కోవర్టు రాజకీయాలు, తండ్రీకొడుకుల వ్యూహ ప్రతివ్యూహాలు స్థానికంగా హాట్ టాపిక్‌గా నిలిచాయి. ఒకవైపు నియోజకవర్గంలో వంద కోట్ల రూపాయల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి దృష్టి సారిస్తుంటే, మరోవైపు రాజకీయ పరిణామాలు ఏ మలుపు తిరుగుతాయోనని వ్యాపార వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. నాగర్‌కర్నూల్ రాజకీయాల్లో ప్రస్తుతం నడుస్తున్న ఆ ఆసక్తికర పరిణామాలపై 'కలంజ్యోతి' ప్రత్యేక కథనం..

- కలంజ్యోతి, నాగర్ కర్నూల్

3 లో

గులాబీ గూటికి కాంగ్రెస్ సమాచారం?

పెట్టుబడులకు అనుకూల తెలంగాణ

2 లో



- 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులకు ఆహ్వానం
- గిగ్ వర్కర్ల పాలసీ ఆవిష్కరణకు రాహుల్‌గాంధీ రాక
- సమ్మిట్‌పై అర్థరహిత ఆరోపణలతో ప్రజలను పక్కదారి పట్టించొద్దు
- 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే ప్రభుత్వ లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక భారత్ సమ్మిట్ 2026 వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధుల రాక, దేశంలోనే అత్యుత్తమ గిగ్ వర్కర్ల పాలసీ ఆవిష్కరణ వంటి కీలక అంశాలతో పాటు సమ్మిట్‌పై జరుగుతున్న విమర్శలకు ముఖ్యమంత్రి ఘాటుగా సమాధానమిచ్చారు. బోధి పెవిలియన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.

కలంజ్యోతి, హైదరాబాద్

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
శనివారం 14.11.2026
www.kalamjyothi.com

పెట్టుబడులకు అనుకూలం తెలంగాణ

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 13) : తెలంగాణలో మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, అనువైన వాతావరణం ఉన్న నేపథ్యంలో రాష్ట్రం పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన ప్రాంతమని ప్రపంచానికి చాటిచెప్పడానికే ప్రభుత్వం భారత్ సమ్మిట్ నిర్వహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ 2026కు సంబంధించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మహ్మద్ అజారుద్దీన్, కేంద్ర విదేశాంగ శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పలువురు ఎంపీలతో కలిసి ముఖ్యమంత్రి బోధి పెవిలియన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న సానుకూల పరిస్థితులను ప్రపంచానికి వివరించేందుకు ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతేడాది కూడా భారత్ సమ్మిట్ నిర్వహించామని, పెట్టుబడులను ఆహ్వానించడంలో తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళుతోందని వివరించారు.



వెయ్యి మంది ప్రతినిధులకు ఆహ్వానం..

భారత్ సమ్మిట్ 2026 కు జాతీయ స్థాయిలోనే కాకుండా దాదాపు 70 దేశాలకు చెందిన వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రతినిధులు, మంత్రులు, పర్యావరణవేత్తలు, పెట్టుబడిదారులు, జర్నలిస్టులు కలిపి సుమారు వెయ్యి మందిని ఆహ్వానించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. రెండు రోజుల పాటు వివిధ సెమినార్లు నిర్వహించి తీర్మానాలు చేయడం ద్వారా తెలంగాణలో ప్రజాస్వామిక వాతావరణం, పెట్టుబడులకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని చాటిచెప్పాలనుకున్నామని అన్నారు. సదస్సు నుంచి తిరిగి వెళ్లేటప్పుడు ఈ ప్రతినిధులు తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానంగా పర్యావరణం, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులు, మానవ వనరులు, వాతావరణం వంటి కీలక అంశాలపై చర్చలు జరుగుతాయని, ప్రజాస్వామ్యంలో సంప్రదింపుల ద్వారా అందరి అభిప్రాయాలను తెలుసుకుని అత్యుత్తమ విధానాలను అనుసరిస్తామని చెప్పారు.

గిగ్ వర్కర్ల పాలసీ ఆవిష్కరణకు రాహుల్‌గాంధీ..

దేశంలో గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారికి ఎలాంటి రక్షణ లేదని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకోవాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ గిగ్ వర్కర్స్ పాలసీని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ పాలసీని ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఆహ్వానించామని, రెండు రోజుల భారత్ సమ్మిట్‌లోనూ ఆయన సందేశం వినిపిస్తారని చెప్పారు. ఢిల్లీలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను ఆహ్వానించామని గుర్తుచేస్తూ, గతంలో ప్రతిపక్ష నేత అటల్ బిహారీ వాజ్‌పేయిని దేశ ప్రతినిధిగా విదేశాలకు పంపించిన సందర్భాన్ని ఉదహరించారు.

3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే ప్రభుత్వ లక్ష్యం..

సమ్మిట్‌ను గుడ్డిగా వ్యతిరేకించడం సమర్థనీయం కాదని, అర్థరహితమైన ఆరోపణలతో ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేయొద్దని ముఖ్యమంత్రి హితవు పలికారు. భారత్ సమ్మిట్ విషయంలో ఎవరికీ అభ్యంతరాలు ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సమ్మిట్‌పై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడుతూ, రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సాంస్కృతికంగా, సాంకేతికంగా హైదరాబాద్ ఎదిగిందని ప్రపంచానికి తెలియజేయడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలకు అడ్డుపడొద్దని విజ్ఞప్తి చేశారు.

ముందస్తు ప్రణాళికతో పంటలు వేయాలి

పంట అవశేషాలతో భూసారం పెంచుకోవాలి

ఖేత్ బచావో అభియాన్‌పై అవగాహన సదస్సులో శ్రీనివాస్

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 13) : చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు.



జీరో వరి సాగు, పంట అవశేషాలతో భూసారం పెంచుకోవాలి..

వరి సాగులో నీటి వినియోగాన్ని తగ్గించేందుకు జీరో వరి సాగు పద్ధతులను అవలంబించాలని శ్రీనివాస్ సూచించారు. పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలే పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నడం వల్ల భూసారం పెరగడంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని వివరించారు. నీరు, విద్యుత్ వనరులను పొదుపుగా వాడుకుంటూ పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుదర్శన్ గౌడ్, వ్యవసాయ అధికారి గోపాల్ రెడ్డి, పశువైద్యాధికారి, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారి తిరుపతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వధూవరులకు బహుజన నాయకుల ఆశీస్సులు

ఆశీర్వదించిన డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 13) : నర్సంపేట మండలం గురజాల గ్రామానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి గొడిశాల అశోక్ గౌడ్ కుమారుడు హరినాగతేజ గౌడ్, హరిప్రియల వివాహం దుగ్గొండి మండలం గిర్నిబావి గ్రామంలోని వందన గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, బహుజన నాయకుడు ఒంటరి రాములు, బీఆర్‌పీ పార్టీ నాయకుడు బుర్రి సాగర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



నూతన దంపతులు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు కలిసిమెలిసి జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నర్సంపేట పట్టణ కార్యదర్శి నూనె రంజిత్ కుమార్ ముదిరాజ్, మండల నాయకుడు జనగాం నవీన్ గౌడ్‌తో పాటు పలువురు బీసీ, బహుజన నాయకులు పాల్గొన్నారు.



చీకట్లోనే జల్లి తండా ప్రజలు

- వీధి దీపాలు వెలగక తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని పాలకవర్గం
- తక్షణమే మరమ్మతులు చేయించాలని డిమాండ్

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 13) : జల్లి తండా గ్రామంలోని పలు వీధుల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు రాత్రి వేళల్లో చీకట్లోనే రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధులన్నీ పూర్తిగా చీకటిమయంగా మారడంతో ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.

పట్టించుకోని సర్పంచ్, వార్డు సభ్యులు..

తండాలో నెలకొన్న ఈ వీధి దీపాల సమస్యను సర్పంచ్, సంబంధిత వార్డు సభ్యుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎటువంటి పరిష్కారం లభించలేదని తండా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యల పట్ల సంబంధిత ప్రజాప్రతినిధులు ఏమాత్రం స్పందించడం లేదని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేయించాలని డిమాండ్..

ఇప్పటికైనా సర్పంచ్, వార్డు సభ్యులు తక్షణమే స్పందించి తండాలోని అన్ని వీధుల్లో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు పనిచేయని లైట్లకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో వెలుతురు ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

శనివారం 14.11.2026

www.kalamjyothi.com

కేటీఆర్‌తో పెద్ది స్వప్న భేటీ


కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 13) : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వరంగల్ జిల్లా మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని కేటీఆర్ స్వగృహంలో జరిగిన ఈ భేటీలో ఆయన కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పలు కీలక అంశాలపై నేతల మధ్య చర్చ..

ఈ సందర్భంగా వరంగల్ జిల్లాలోని తాజా రాజకీయ పరిస్థితులు, స్థానిక సంస్థల బలోపేతం వంటి పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని కేటీఆర్ ఈ సందర్భంగా సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహంపై సమాలోచనలు..


రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ భేటీలో ప్రత్యేకంగా చర్చించారు. ఓటర్ల నమోదు, ప్రచార సరళి, నాయకుల మధ్య సమన్వయంపై కేటీఆర్ పలు కీలక సూచనలు చేశారు.



పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన

రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా కేటీఆర్‌కు వివరించారు.

కాంగ్రెస్‌లో కోవర్టులు!



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (నవంబర్ 13) : నాగర్‌కర్నూల్ నియోజకవర్గ రాజకీయాలు రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న కొందరు వ్యక్తులు ఉన్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు బీఆర్ఎస్‌లోనూ కాంగ్రెస్‌కు సమాచారం చేరవేస్తున్న కోవర్టులు ఉన్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో ఇరు పార్టీల మధ్య అంతర్గత రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి.

వ్యూహాత్మకంగా ఎమ్మెల్యే అడుగులు..

కాంగ్రెస్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల రాజేష్ రెడ్డి ప్రతి అడుగును ఆచితూచి వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అందరి అభిప్రాయాలను వింటూనే తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని, ప్రత్యర్థులకు ఎక్కడ చెక్ పెట్టాలనే అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని సమాచారం. తండ్రి కూచుకుల దామోదర్ రెడ్డి రాజకీయ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటూ ముందుకు సాగుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వందమంది ఉన్నా.. వ్యూహం మాత్రం గోప్యమే!

ఎమ్మెల్యే వెంట ఎంతమంది ఉన్నారన్నది కాదు.. ఆయన తదుపరి రాజకీయ అడుగు ఏమిటన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తండ్రీకొడుకులు రాజకీయ అంశాలపై చర్చించుకుంటూ భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తున్నారనే ప్రచారం వినిపిస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల రాజకీయ సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేస్తే ప్రత్యర్థి పార్టీకి నష్టం తప్పదనే చర్చ కూడా సాగుతోంది.

అభివృద్ధి పనులపై దృష్టి.. ప్రచారానికి దూరం!

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, నిధులు, కాంట్రాక్టుల అంశాలపై ఎమ్మెల్యే దృష్టి సారిస్తున్నారని అనుచర వర్గాలు చెబుతున్నాయి. సుమారు రూ.100 కోట్ల విలువైన పనులు తీసుకొచ్చినట్లు ఆయన వర్గాల్లో ప్రచారం జరుగుతున్నప్పటికీ, వాటిని విస్తృతంగా ప్రచారం చేసుకోకుండా ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వ్యాపార వర్గాల్లోనూ రాజకీయ చర్చ..

గతంలో ఎదురైన రాజకీయ పరిణామాలు, వ్యాపార వర్గాలపై ప్రభావం చూపిన అంశాలు ఇప్పుడు మళ్లీ చర్చకు వస్తున్నాయి. భవిష్యత్తులో ఎలాంటి రాజకీయ పరిస్థితులు ఏర్పడతాయోనని కొందరు వ్యాపారులు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతానికి తమ వ్యాపారాలు ప్రశాంతంగా కొనసాగాలన్నదే తమ అభిప్రాయమని పలువురు భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ వినిపిస్తోంది.

ఎన్నికలకు ఇంకా సమయం.. ప్రజల చూపు భవిష్యత్తుపైనే!

ఎన్నికలకు ఇంకా సమయం ఉండటంతో ప్రజలు కూడా ప్రస్తుత రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. ఇప్పుడే ఒక నిర్ణయానికి రాకుండా, నాయకుల పనితీరు, అభివృద్ధి, ప్రజలకు అందుబాటులో ఉండే తీరు ఆధారంగా భవిష్యత్తులో తమ నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు కనిపిస్తోంది. మొత్తంగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఎవరి వ్యూహం ఏమిటి? ఎవరు ఎవరికి చెక్ పెట్టబోతున్నారు? కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో అంతర్గత రాజకీయాలు ఎలాంటి మలుపు తిరగనున్నాయి? అన్నది ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

యువత దేశానికి నిజమైన సంపద

మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 13) : యువత దేశానికి నిజమైన సంపద అని, మత్తు పదార్థాలకు బానిసై బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నషా ముక్త యువ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా యువతలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, యువత తమ శక్తి సామర్థ్యాలను దేశాభివృద్ధికి వినియోగించడం శ్రేయస్కరమని ఆయన సూచించారు.

యువత భాగస్వామ్యం కావాలి..

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత చురుకైన పాత్ర పోషించాలని, ఆరోగ్యవంతమైన యువతతోనే అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుందని ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు



జమాల్, జిల్లా యువజన అధికారి రమేష్, కౌన్సిలర్లు సాదం అరవింద్, గంజి రాజు, జింక సురేందర్, శ్రీరామోజీ నరేష్, కూన శశాంక్, ఈశ్వర్, బీజేపీ నాయకులు కందుల హరీష్, భరత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే!

- **ప్రమాదకరంగా నర్సంపేట–నెక్కొండ రహదారి**
- **బతుకమ్మ మోరి వద్ద రోడ్డు పక్కనే గుంతలు**
- **హెచ్చరిక బోర్డులు లేక వాహనదారుల ఇబ్బందులు**
- **తక్షణమే భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి**

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 13) : చెన్నారావుపేట మండల కేంద్రంలోని నర్సంపేట-నెక్కొండ ప్రధాన రహదారిపై బతుకమ్మ మోరి వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. వైస్స్ ఎదురుగా రాజు ఫాస్ట్ ఫుడ్ దగ్గర ఇరువైపులా రహదారి పక్కన గుంతలు ఉన్నప్పటికీ, వాహనదారులను అప్రమత్తం చేసే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది.


వాహనదారుల ఇబ్బందులు..

ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు రోడ్డు పక్కన ఉన్న గుంతలను గుర్తించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏమాత్రం ఆదమరిచి అజాగ్రత్తగా ఉన్నా పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


భద్రతా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి..

సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి మోరికి ఇరువైపులా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, గుంతల వద్ద తగిన భద్రతా చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నివారణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
4
శనివారం 14.11.2026
www.kalamjyothi.com



కండెక్కిన కోడిగుడ్డు ధర

డజన్ రూ.80 నుంచి రూ.96కు చేరిన వైనం

రిటైల్ మార్కెట్లో రూ.8 పలికిన ఒక్కో గుడ్డు

డిమాండ్‌కు తగిన సరఫరా లేకనే ధరల పెరుగుదల

హైదరాబాద్, విశాఖపట్నంలో భగ్గుమన్న ఎన్ఈసీసీ ధరలు

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 13) : తెలుగు రాష్ట్రాల్లో సామాన్యుడికి కోడిగుడ్డు ధర గట్టి షాక్ ఇస్తోంది. గత మూడు నెలలుగా నిలకడగా ఉన్న గుడ్ల ధరలు కొద్ది రోజులుగా క్రమంగా పెరుగుతూ కొండెక్కాయి. హోల్‌సేల్ మార్కెట్లో డజన్ గుడ్ల ధర గతంలో రూ.80 ఉండగా, నాలుగైదు రోజుల క్రితం రూ.90కి చేరింది. ప్రస్తుతం ఆ ధర ఏకంగా రూ.96కు చేరుకుంది. స్వల్ప వ్యవధిలోనే డజన్‌పై ఏకంగా రూ.16 మేర ధర పెరగడంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.

రిటైల్ మార్కెట్లో రూ.8 పలికిన ఒక్కో గుడ్డు..

హోల్‌సేల్ ధరలకు అనుగుణంగా రిటైల్ మార్కెట్లోనూ ధరలు ఒక్కసారిగా పుంజుకున్నాయి. గతంలో చిల్లర దుకాణాల్లో రూ.6 నుంచి రూ.7 మధ్య పలికిన ఒక్కో కోడిగుడ్డు ధర, ప్రస్తుతం రూ.7.50 నుంచి రూ.8 వరకు పలుకుతోంది. ఆగస్టు మొదటి వారంలో తగ్గిన గుడ్డు ధర డజన్ రూ.80 వద్దే దాదాపు వారం క్రితం వరకు స్థిరంగా కొనసాగింది.

డిమాండ్‌కు తగిన సరఫరా లేకనే ధరల పెరుగుదల..

గత కొద్ది రోజులుగా మార్కెట్లో డిమాండ్‌కు తగిన స్థాయిలో సరఫరా లేకపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో ధరలు వేగంగా పెరిగాయి. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరల భారంతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రధాన పోషకాహార వనరుగా ఉండే కోడిగుడ్డు ధర కూడా పెరగడం మరింత భారంగా మారుతోంది.

హైదరాబాద్, విశాఖపట్నంలో భగ్గుమన్న ఎన్ఈసీసీ ధరలు..

నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) సూచించిన హోల్‌సేల్ ధరల ప్రకారం హైదరాబాద్‌లో 100 గుడ్ల ధర రూ.640గా ఉండగా, విశాఖపట్నంలో రూ.625 వద్ద నమోదైంది. రాబోయే రోజుల్లో మార్కెట్లో గుడ్డు ధరలు ఇంకా పెరుగుతాయా, లేక దిగివస్తాయా అన్నది వేచి చూడాల్సి ఉంది.

అర్ధరాత్రి నగరానికి చేరుకున్న రాహుల్‌గాంధీ

నేడు గిగ్ వర్కర్ల మహా ర్యాలీ



కలంజ్యోతి, హైదరాబాద్ : నేడు గిగ్ వర్కర్ల భారీ ప్రదర్శనకు వేదిక కానుంది. సామాజిక భద్రత, కార్మిక హక్కులు, సంక్షేమ చర్యలను డిమాండ్ చేస్తూ తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) పిలుపునిచ్చిన ఈ మహా ర్యాలీ శిల్పకళా వేదిక నుంచి హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ) వరకు జరగనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఇప్పటికే శుక్రవారం అర్ధరాత్రి నగరానికి చేరుకున్నారు. రాత్రి నోవాటెల్‌లో బస చేశారు. శనివారం ఉదయం లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా నాయకులతో, అమెరికా, యూరోపియన్ ప్రతినిధులతో సమావేశం కానున్నారు. సాయంత్రం 3 గంటలకు సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో ప్రసంగిస్తారు. 2023 భారత్ జోడో యాత్ర, అలాగే అసెంబ్లీ ఎన్నికల సమయంలో గిగ్ కార్మికులకు ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే 'తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యాక్ట్2026'ను రూపొందించింది. నేటి బహిరంగ సభ వేదికపై రాహుల్ గాంధీ ఈ కొత్త చట్టాన్ని, సంక్షేమ పథకాలను అధికారికంగా ప్రారంభించనున్నారు. దీనితో పాటు కార్మికుల నమోదు, ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను కూడా ఆవిష్కరిస్తారు. ఈ చట్టం అమల్లోకి రావడం వల్ల డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్ సేవల కార్మికులకు తప్పనిసరి రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, ప్రమాద బీమా, ప్రత్యేక సంక్షేమ బోర్డు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వంటి వాటికి చట్టబద్ధమైన హామీ లభించనుంది. ప్రభుత్వ నిర్ణయాలపై టీజీపీడబ్ల్యూయూ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ హర్షం వ్యక్తం చేస్తూ, రాజకీయాలకు అతీతంగా ప్రతి గిగ్ కార్మికుడికి గౌరవం, సామాజిక భద్రత కల్పించడమే తమ ఉద్యమ లక్ష్యమని తెలిపారు. చట్టం ద్వారా లభించిన హక్కులను పూర్తిస్థాయిలో, మెరుగైన పద్ధతిలో అమలు చేయాలని కోరుతూ నేటి ర్యాలీలో కార్మికులు తమ గళాన్ని వినిపించనున్నారు.



ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలవడం అభినందనీయం

ఘనంగా రిపోర్టర్ మధు జన్మదిన వేడుకలు

వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ బోడ అనిల్‌నాయక్

కలంజ్యోతి, మహబూబాబాద్ (నవంబర్ 13) : మహబూబాబాద్ జిల్లా 6టీవీ సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మధు జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ ఇంచార్జి డాక్టర్ బోడ అనిల్ కుమార్ నాయక్ పాల్గొన్నారు. తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు వేణు సమక్షంలో జరిగిన ఈ వేడుకల్లో అనిల్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం కోసం తనదైన శైలిలో కృషి చేస్తున్న మధుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా జనరల్ సెక్రెటరీ ఉమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, పలువురు జర్నలిస్టు మిత్రులు పాల్గొన్నారు.



డీఆర్డీఏ కార్యాలయంలో

ఆర్టీఐ రికార్డుల తనిఖీ

17 దరఖాస్తుల సమాచారాన్ని ఉచితంగా అందించాలి

కాట కుమారస్వామి

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 13) : సమాచార హక్కు పరిరక్షణ కమిటీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి వరంగల్ డీఆర్డీఏ కార్యాలయంలో సుమారు నాలుగున్నర గంటల పాటు ఆర్టీఐ రికార్డులను తనిఖీ చేశారు. మొత్తం 18 దరఖాస్తులకు సంబంధించి కోరిన సమాచారంలో ఒక దరఖాస్తు వివరాలు, జిరాక్స్ ప్రతులను అధికారులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సహకరించిన డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, డీపీఎం, ఇతర కార్యాలయ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన 17 ఆర్టీఐ దరఖాస్తులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కూడా సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 7(6) ప్రకారం ఉచితంగా అందించాలని కోరారు. శ్రీనిధి పథకం నిధుల కేటాయింపులు, రుణాలు, లబ్ధిదారుల వివరాలు, వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, యంత్రాల కొనుగోళ్లు, పంపిణీ, బిల్లులు, మండలాల వారీగా నిధుల ఖర్చు వివరాలను అందించాలని డిమాండ్ చేశారు. రికార్డుల పరిశీలన అనంతరం ఏవైనా అవకతవకలు గుర్తిస్తే ఆధారాలతో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తానని, త్వరలో చెన్నారావుపేట మండలానికి సంబంధించిన ఆర్టీఐ వివరాలను కూడా ప్రజల ముందుకు తీసుకువస్తానని తెలిపారు. ప్రజాధనం వినియోగంపై ప్రశ్నించడం పౌరుల హక్కు అని, పారదర్శకత, జవాబుదారీతనం పెరిగినప్పుడే అవినీతికి అడ్డుకట్ట పడుతుందని, సమాచార హక్కు చట్టమే ప్రజల చేతిలో బలమైన ఆయుధమని కాట కుమారస్వామి పేర్కొన్నారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

5

శనివారం 14.11.2026

www.kalamjyothi.com



ప్రభుత్వ పాఠశాలకు టీవీ బహూకరణ

ఉపసర్పంచ్ మీసాల నర్సింహులు దాతృత్వం

కలంజ్యోతి, నర్సాపూర్ (నవంబర్ 13) : హత్నూర మండల పరిధిలోని నాగారం గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలనే సదుద్దేశంతో నాగారం ఉపసర్పంచ్ మీసాల నర్సింహులు ఉచితంగా టీవీని బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరానికి అనుగుణంగా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నాణ్యమైన విద్యను నేర్చుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థుల కోసం టీవీని విరాళంగా అందించిన ఉపసర్పంచ్ నర్సింహులుకు హెడ్మాస్టర్ సబిత, ప్రధానోపాధ్యాయులు ధర్మారావు కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యార్థుల అభివృద్ధికి మీ సహకారం ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. అనంతరం ఉపసర్పంచ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.



చిన్నారి విరాట్‌కు భూదేవి ఫౌండేషన్ చేయూత

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 13) : ఆ పదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న భూదేవి ఫౌండేషన్ మరోసారి తన సేవా గుణాన్ని చాటుకుంది. చెన్నారావుపేట మండలంలోని ఎల్లయ్యగూడెం గ్రామానికి చెందిన వేముల రవళి కుమారుడు విరాట్ (5) మానసిక ఎదుగుదల లోపంతో పాటు నడవలేని పరిస్థితిలో ఉండటాన్ని గుర్తించిన ఫౌండేషన్ సభ్యులు చిన్నారికి ఆర్థిక సహాయం అందించారు. ఫౌం డేషన్ చైర్మన్ మదూరి రామకృష్ణ గౌడ్ సూచన మేరకు ఈ సహాయాన్ని అందజేశారు. చిన్నారి విరాట్‌కు భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయం అందించేందుకు భూదేవి ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో పేద కుటుంబాలను ఆదుకుంటూ ఫౌండేషన్ మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తోందని పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మేడి సంతోష్, మరారి ఉప్పలయ్య, కందాల చంద్రమౌళి, మేడి వంశీకృష్ణ, కొండ్ల లక్ష్మీనర్సయ్య, నవీన్, చీనూరి కర్ణాకర్ పాల్గొన్నారు.



సూక్ష్మ సేద్యంతో అధిక దిగుబడులు

ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 13) : పంటల సాగులో నీటి వినియోగాన్ని తగ్గించి, అధిక దిగుబడులు సాధించేలా సూక్ష్మ సేద్య పద్ధతులను అవలంబించేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యానవన పంటల సాగును మరింతగా ప్రోత్సహించాలని, సూక్ష్మ సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

వందశాతం హాజరు, మౌలిక వసతులు కల్పించాలి..

ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వందశాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమగ్ర శిక్షా అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించాలని, వీబీజీ రామ్ జీ పథకం కింద నీటి సంరక్షణ పనులను చేపట్టి భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు వెంకట మాధవ రావు, రాథోడ్ రమేష్, డీఈఓ భోజన్న, డీపీఓ శ్రీనివాస్, సీపీఓ గంగారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి రమణ, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, నీటిపారుదల శాఖ అధికారులు రాజేంద్రప్రసాద్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారి వరుణ్ తేజ్ జన్మదిన వేడుకలు

వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన పెండం రామానంద్ చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 13) : నర్సంపేట మండలం సర్వాపురం గ్రామానికి చెందిన ఈదుల రేణుక, శ్రీను దంపతుల కుమారుడు చిరంజీవి వరుణ్ తేజ్ మొదటి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్వాపురంలో జరిగిన ఈ వేడుకలకు టీపీసీసీ సభ్యుడు పెండం రామానంద్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారి వరుణ్ తేజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గంధం నరేందర్, ఆరో వార్డు కౌన్సిలర్ పున్నం నర్సింహారెడ్డి, నర్సంపేట డివిజన్ కౌన్సిలర్లు పత్తిని రాజేందర్, మాదాసి రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నర్సంపేట డివిజన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు డిస్ బాబా, మోటం రవి, బత్తిని విజయేందర్, నాడెం ప్రదీప్ కన్నా, చిప్ప నాగ, మహిళా నాయకులు, ఆరో వార్డు ప్రజలు, కుటుంబ సభ్యులు ఈదుల కోమల వెంకన్న, ఈదుల లావణ్య రమేష్, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిద్ధేశ్వరాలయంలో నాగుల చవితి వేడుకలు

తెల్లవారుజాము నుంచే నాగేంద్ర స్వామికి క్షీరాభిషేకాలు పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేసిన మహిళలు

భక్తజన సందోహంతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం





కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 13) : నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని చెన్నారావుపేట మండల కేంద్రంలోని శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసంలో నాగుల చవితి రావడంతో ఈ పర్వదినానికి మరింత విశిష్టత చేకూరింది.

తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సర్పదోష నివారణ, కుటుంబ సౌభాగ్యం, సంతానాభివృద్ధి, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు నాగదేవతను భక్తితో ఆరాధించారు. ముఖ్యంగా మహిళలు ఉపవాసాలు పాటిస్తూ పుట్టలో పాలు పోసి, చలివిడి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం..

ఆలయ అర్చకులు సాయీశ్వర్ వేదమంత్రోచ్చారణల నడుమ శ్రీ నాగేంద్ర స్వామికి పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం శ్రీ సిద్ధేశ్వర స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు బిక్షమయ్య శాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నాగుల చవితి, కార్తీకమాసం ఒకేసారి రావడంతో ఉదయం నుంచే మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకోవడంతో శ్రీ సిద్ధేశ్వరాలయం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. భక్తుల నాగేంద్ర స్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

గోల్డెన్ లుక్‌లో ప్రగ్యా జైస్వాల్ మెరుపులు

కంచె, అఖండ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన నటి ప్రగ్యా జైస్వాల్ తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన బ్లాక్ అండ్ గోల్డ్ అవుట్‌ఫిట్ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కారులో కూర్చొని స్టైలిష్‌గా ఇచ్చిన ఈ పోజులు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కంచెతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి, బాలకృష్ణ అఖండ చిత్రంతో స్టార్ క్రేజ్ అందుకున్న ఈ భామ.. డికు మహారాజ్, అఖండ 2: తాండవం, బాలీవుడ్ చిత్రం ఖేల్ ఖేల్ మే వంటి సినిమాలతో అలరించింది. ప్రస్తుతం సన్నీ డియోల్‌తో కలిసి నటిస్తున్న సూర్య: అంత్ సే ఆరంభ్ తక్ సినిమా నవంబర్ 20న విడుదలకు సిద్ధమవుతుండగా, తెలుగులో టైసన్ నాయుడు చిత్రంలోనూ ప్రగ్యా నటిస్తోంది.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.